# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో రెండో విడత 'పద్మ' పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడు సభలో వెల్లడించారు.**
3. **అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**
4. **తెలంగాణలో రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలను జూన్ 2 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**
5. **అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు, రేపు వర్షాలు కురుస్తాయని భారత వాతావరరణ శాఖ పేర్కొంది.**

=========================

ఢిల్లీలో 'పద్మ' పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం నిన్న ఘనంగా జరిగింది. రాష్ట్రపతి భవన్‌లో గత సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పలు రంగాల్లో విశేష సేవలందించిన పలువురికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రదానం చేశారు. వీరిలో కన్నడ నటుడు అనంత్ నాగ్ పద్మభూషణ్ అవార్డును అందుకోగా, ఆంధ్రప్రదేశ్ నుంచి వి.రాఘవేంద్రాచార్య పంచముఖి, ప్రొఫెసర్ కేఎల్ కృష్ణలకు పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. అలాగే తెలంగాణ నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్సార్ కడప జిల్లాలో తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమం నిన్నటి నుంచి ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంపై మా ప్రతినిధి ఎమ్. మనోహర్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్..21 సెకన్లు

ఇదిలా ఉండగా నిన్న జరిగిన తెలుగు దేశం పార్టీ మహానాడు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేశామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.వానాకాలం పంటకు వ్యవసాయ శాఖ సన్నద్ధతపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల పరిహారం అందించేందుకు నివేదికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. విశాఖలో జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమాలపై మా ప్రతినిధి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ..35 సెకన్లు

కాగా యోగ ప్రాముఖ్యతపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఉగ్రవాదానికి మద్దతుగా పాకిస్థాన్ చర్యలను భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా బహిర్గతం చేస్తోంది. అఖిల పక్ష బృందాల ప్రతినిధులు వివిధ దేశాలను సందర్శించి ఉగ్రవాదం పట్ల భారత్ వైఖరిని తెలియజేస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు శశి థరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధిల బృందం నిన్న దక్షిణ అమెరికా దేశమైన గయానాలో పలువురితో సమావేశమయ్యింది. ఈ సందర్భంగా ఎంపీ శశి థరూర్ పాత్రికేయిలతో మాట్లాడుతూ, ఉగ్రవాద దాడులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గయానా భారతదేశానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. అదే విధంగా జేడీ(యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలోని మరో అఖిలపక్ష ప్రతినిధి బృందం సింగపూర్ విదేశాంగ, హోం వ్యవహారాల సీనియర్ సహాయ మంత్రితో సమావేశమయ్యింది.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనం తెలుపుతోంది . సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా భారత్-పాక్ యుద్ధంలో ధైర్య సాహసాలను ప్రదర్శించిన అబ్దుల్ హమీద్ గురించి ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్ ... 32 సెకన్లు

---------------------------

భారత ప్రామాణికాలు  ఇప్పుడు ప్రపంచ ప్రామాణికంగా మారుతున్నాయని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఢిల్లీలో జరిగిన భారతీయ ప్రమాణాల సంస్థ– బిఐఎస్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో నిన్న  ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హాల్ మార్కింగ్ విషయంలో గణనీయమమైన అభివృద్ధి జరుగుతోందన్నారు.

---------------------------

తెలంగాణలో రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలను జూన్ 2 వ తేదీ నుంచి 9 వ తేదీ  వరకు పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో రాజీవ్ యువ వికాసం పథకంపై నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 10 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు పలు చోట్లవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారి జి.లక్ష్మి వివరిస్తూ …

వాయిస్..26 సెకన్లు

మరోవైపు.. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్–ఐపీఎల్ లో భాగంగా  నిన్న లక్నో  వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య  జరిగిన మ్యాచ్‌లో  బెంగళూరు 6 వికెట్ల తేడాతో లక్నోపై విజయం సాధించింది.  టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. అనంతరం బెంగళూరు 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేయడంతో విజయం సాధించింది.

=====================